ఈనాడు
తూర్పుగోదావరి
Dt. 29-4-2013

## అందలం అందుకోవడానికి...

# అర డజను సూత్రాలు




**'ఈనాడు'తో మెట్రోరైలు ఎండీ ఎన్‌వీఎస్‌రెడ్డి**

**"చదువు ఉద్యోగం సంపాదించడానికే కాదు.. సామాజిక స్పృహను పెంపొందించుకోడానికి కూడా.. స్థానికంగా ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటే ఉన్నతంగా రాణించవచ్చు. పట్టణ ప్రాంతాల్లో కన్నా గ్రామీణ ప్రాంతాల్లోనే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఏదైనా సాధించాలనే పట్టుదల, దానికి తగ్గ కృషి చేసే తత్వం గ్రామీణుల్లోనే ఎక్కువగా ఉంటాయి." అని జిల్లా వాసి, హైదరాబాద్ మెట్రోరైలు ఎండీ ఎన్‌వీఎస్ రెడ్డి అంటున్నారు. అనపర్తి వచ్చిన ఆయన యువతరానికి కొన్ని విజయసూత్రాలు, తన జీవితంలో వాటిని అమలు చేసిన తీరును చెప్పారు...**



**1 లక్ష్యనిర్దేశం :** ప్రతి ఒక్కరి జీవితంలో ఒక లక్ష్యం ఉంటుంది. దాన్ని గుర్తించే సరికే ఆలస్యం అవుతుంది. ఉన్నత పాఠశాలలో చదివే సమయంలో ఏదైనా అంశంపై దృష్టిసారిస్తే, ఇంటర్మీడియట్ పూర్తయ్యే సరికి మంచి లక్ష్యాన్ని ఏర్పరుచుకోగలరు. ప్రధానంగా ఎక్కువగా పుస్తకాలు చదవాలి. అప్పుడే సంకుచితభావం పోయి విశాల దృక్పథం ఏర్పడుతుంది. సమాజంపై అవగాహన వస్తుంది. దీని ఆధారంగా లక్ష్యాలు ఏర్పడతాయి. పట్టణప్రాంతాల్లో తమ పిల్లలకు తల్లిదండ్రులు మార్గనిర్దేశం చేస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో అక్కడి పరిస్థితులు, తనకు ఆసక్తి ఉన్నరంగాలను ఎంపిక చేసుకోవాలి.

**నా జీవితంలో..:** నేను ఆరో తరగతి నుంచే పుస్తకాలు చదవడం ప్రారంభించా. ఇంటర్మీడియట్‌లోనే సివిల్స్‌ను లక్ష్యంగా ఏర్పరుచుకున్నా. అప్పటికి సివిల్స్ అంటే కేవలం కలెక్టర్ అనే భావన మాత్రమే ఉండేది. ఒకసారి నిర్ణయం తీసుకుంటే తిరిగి వెనక్కి తీసుకోను. అదే నన్ను ముందుకు నడిపించింది. అప్పటి మా ప్రిన్సిపల్ రుద్రయ్యచౌదరి, ఆంగ్ల అధ్యాపకులు వై.వెంకటరామయ్య ప్రోత్సహించారు.

**2 ప్రతికూల ఫలితం వస్తే..:** ఒలింపిక్స్‌లో ఒక గోల్ ఉంటే పతకం వస్తుంది . లక్ష్యం పెద్దదిగా ఉంటే ఓటమి తప్పకపోవచ్చు. ఆ సమయంలో కుంగిపోకూడదు. మనపై మనకు ఆత్మవిశ్వాసం ఉండాలి. అదే ముందుకు నడిపిస్తుంది. ఓటమి కారణాలను విశాల దృక్పథంతో విశ్లేషించుకోవాలి. ఒక కోణం నుంచే కాకుండా విభిన్న కోణాల్లో గెలవడానికి ఉన్న మార్గాలు అన్వేషించాలి. ఓటమే గెలుపునకు పునాది.



**నా జీవితంలో..:** ప్రైవేటు భాగస్వామ్యంతోమెట్రో ప్రాజెక్టు నిర్మాణానికి ప్రతిపాదించినప్పుడు ఉన్నతాధికారులు నాతో విభేదించారు. దీనిపై అన్ని కోణాల్లో వారికి వివరించి, వారు అసాధ్యమన్నదాన్ని సుసాధ్యం చేసి చూపించాను. వారు అంగీకరించలేదని అక్కడితో నా నిర్ణయం వెనక్కి తీసుకుంటే ఈ రోజు ఈ పరిస్థితి ఉండేదా..?

**3 అవకాశాలు అందిపుచ్చుకోవడం ఎలా?:** అవకాశాలు ఎప్పుడొస్తాయో ఎవరికీ తెలియదు. మనమే అవకాశాలు సృష్టించుకోవాలి. మనకు ఆసక్తి ఉన్న రంగంపై పరిశోధించి నైపుణ్యాలు పెంచుకోవాలి. చదువంటే ఉద్యోగం కోసమేకాదు. ఇప్పుడు అన్ని రంగాల్లో మంచి అవకాశాలు ఉన్నాయి. నైపుణ్యాలు ఉన్న వారి దగ్గరకు అవే వస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న కులవృత్తులపై పరిశోధన చేస్తే మంచి

**నా జీవితంలో..:** నేను చదువుకునే సమయంలో ఇప్పుడున్నన్ని అవకాశాలు లేవు. సివిల్స్ కోసం కష్టపడి చదివాను. నేను అనుకున్నది సాధించేందుకు ఎవరు వద్దన్నా వినలేదు. నా లక్ష్యం కోసమే పోరాడాను.. సాధించాను.

**4 పడి లేచిన కెరటంలా..:** లక్ష్యాలను ఉన్నతంగా నిర్దేశించుకున్నపుడుసాధించడం కష్టం. ఒక్కో సందర్భంలో తీవ్ర పతనావస్థకు చేరుకునే పరిస్థితి ఏర్పడుతుంది. అటువంటి సందర్భాల్లో నిరాశ పడకూడదు. ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి. అపజయాలు నేర్పిన పాఠాలే విజయానికి మెట్లు వేస్తాయి.

**నా జీవితంలో..:** పంజాగుట్ట ఫ్లైఓవర్ కూలిన సందర్భంలో నన్ను తొలగించాలని పెద్ద ఎత్తున డిమాండ్ చేశారు. ఆ సమయంలో నాకు ప్రైవేటు సంస్థల నుంచి ఎక్కువ అవకాశాలు వచ్చాయి. కానీ నేను అంగీకరించలేదు. నాలోని ఆత్మవిశ్వాసమే నన్ను నిలిపింది.

**5 లక్ష్య సాధన ఇలా..:** లక్ష్యం నిర్దేశించుకున్న తరువాత దాన్ని సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా శ్రమించాలి. ఒత్తిడిని అధిగమించాలి. వ్యక్తి తనకున్న మేధస్సులో 10శాతం వినియోగిస్తే అద్భుతాలు సృష్టించవచ్చు. ఎక్కువ మంది ప్రణాళిక లేకుండా సాధన చేయడం వలనే విజయాలు సాధించలేకపోతున్నారు. జపాన్ వంటి దేశాల్లో ఏదైన ఒక పనిచేయాలంటే ముందు ప్రణాళిక సిద్ధం చేసి, తరువాత పనులు ప్రారంభిస్తారు. ఇక్కడ పనులు ప్రారంభించాక ప్లానింగ్ కోసం ఆలోచిస్తారు. అందుకే వాటి ఫలాలు ఆలస్యంగా అందుతున్నాయి.

**నా జీవితంలో..:** హైదరాబాద్ మెట్రోప్రాజెక్టులో సింగిల్ పిల్లర్‌తో నిర్మాణం చేస్తానంటే అందరూ అసాధ్యం అన్నారు. పక్కా ప్రణాళికతో అందంగా తీర్చిదిద్ది సాధించాను. దేశంలో సింగిల్ పిల్లర్ ప్రాజెక్టుల్లో ఇదే ప్రథమం. ఇప్పుడు జైపూర్‌లో ఈ తరహా నిర్మాణంచేపడుతున్నారు. నా అక్షరాలు వెన్నెల్లో ఆడుకొనే అందమైన ఆడపిల్లలని ప్రఖ్యాత రచయిత తిలక్ అన్నట్లు నా నిర్మాణాలు అందమైన ఆడపిల్లల్లా ఉండాలని నేను భావిస్తాను.

**6 కష్టం కూడా ఇష్టంగా :** ఆత్మవిశ్వాసం, విశాలంగా ఆలోచించే దృక్పథం, కష్టపడేతత్వం, ఏకాగ్రత, సమాజంపై అవగాహన, ప్రశ్నించేతత్వం ఉండాలి. లక్ష్యం నిర్దేశించుకున్నాక వెనక్కి తిరిగి చూడకూడు. దాన్ని సాధించేంత వరకు ఎన్ని ఒడుదొడుకులు ఎదురైనా పట్టుదలతో శ్రమిస్తే ఎంతటి లక్ష్యాన్నైనా అధిగమించవచ్చు. ఈ ధోరణిని ఎంత కష్టతరమైన పనిలోనైనా అవలంబించాలి. ప్రధానంగా యువత ఇటీవల కాలంలో వ్యవసానాలకు లోనవుతున్నారు. ఇవి వారి భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతోంది. జీవితంలో ఉన్నతంగా రాణించాలని, తమ లక్ష్యాలు సాధించాలనుకునే వారు వీటికి దూరంగా ఉండాలి. అప్పుడే లక్ష్యాలు నెరవేరి వాటి ఫలితాలు మధురంగా ఉంటాయి.

**నా జీవితంలో..:** నాకు విద్యార్థి దశలో ఆంగ్లం సరిగా వచ్చేది కాదు. చాలా ఇబ్బంది పడ్డాను. చాలా మంది అవహేళన చేశారు. అయినా కుంగిపోలేదు. పట్టుదలతో నేర్చుకుని అనుకున్నది సాధించాను.

HYDERABAD METRO RAIL

ఈనాడు.